ఈ వారం కథ

# కొడుకు దొరికాడు



నీలమ్మ దోసె పెనం మీద నుంచి చూపు ఇటు తిప్పింది.

మనోరంజనమ్మ మొత్తలో నిలుచుని వుంది- నడింట్లో ఉయ్యాల బల్ల ఇంకా ఊగుతూనే వుంది.

కమలమ్మ కుడి చేతిని కొంగుకి తుడుచుకుంటూ వాకిట్లోకి వచ్చింది.

అప్పటికే రోడ్డుమీద ఒకరిద్దరు పరిగెడుతున్నట్లుగా నడుస్తున్నారు.

నా నిద్రకళ్ళ మసక దృశ్యం చెదిరిపోయింది. వీధి తలుపుని ఆనుకొని పడమరగా చూశాను.

పదిళ్ళ అవతల ఒక ఇంటిముందు పెద్ద గుంపు వుంది.

'నీలక్కా యేందక్కడ?' నా వెనక నుంచి మా పిన్నమ్మ అడిగింది.

'యేందో చెంద్రమ్మా, తెలీలే' అంటూ నీలమ్మ పొయ్యిలో ఖణ ఖణ మండుతున్న కట్టెలు కొంచెం బయటకు లాగి నీళ్ళు చల్లింది. చెమ్మ చేతిని చీరకి అద్దుకుంటూ వాకిట్లోకి వచ్చి నిలబడింది.

మనోరంజనమ్మ ఇంటి తలుపు గొళ్ళెం పెట్టి తాళం వేస్తోంది.

కమలమ్మ అప్పడే గుంపుని సమీపిస్తోంది.

'మనోరంజనక్కా, ఆడ యేమైందో సూడు- ఈ దరిద్రం మాడిపోతుండాదే' అంటూ నీలమ్మ తిరిగి పొయ్యి దగ్గరికి వెళ్ళింది. నిలుచునే దోసె తిరగేసింది. ఇంతలో ఆమె కూతురు 'యేందమా?' అంటూ ఇంట్లోంచి బయటకు వచ్చింది.

'అదేందో చూసిరాబో, బిన్నారా దోసి చూస్తూ' అంటూ కూతుర్ని తరిమింది.

ఇప్పుడు వీధి వీధంతా మొత్తల్లో చేరింది- అందరూ ఆసక్తిగా పడమరగా చూస్తున్నారు. దూరంగా గుంపులోంచి ఎవరో ఒకామె బయటకి వచ్చింది.

'మా జయమ్మ గావాల వస్తా ఉండాది బొండి' అని నీలమ్మ సంతోషంతో అనింది.

'కో, పద్దమ్మ గదా?' అనింది మా పక్కింటి బూబమ్మ.

నద్దీ ఊపుకుంటూ, చేతులు తిప్పతూ, గడగడా మాట్లాడుతూ పద్మమ్మ వచ్చింది.

"యెవురోనమ్మా బిడ్డ మకరాజులాగా వుండాడు. నడీదిలో తెలివితప్పి పడిపోయినాడు. నోట్లోంచి ఒక మాటలే, మంచిలే. కట్టెమాదిరి పడుండాడు. నల్ల ప్యాంటు, చారల చొక్కాయ యేస్కోనుండాడు. సదూకున్నోడి మాదిరే ఉండాడు షూడబోతే. యాడ్నించొచ్చినాడో యేందో" ఎవ్వరూ అడగక ముందే వివరాలన్నీ చెప్పేసింది.

"యెట్టుండాదిప్పడో?" అందరూ ఆందోళనగా అడిగారు.

"యేమో చెప్పలేం- మూర్ఛేమోగావలని బీగాలు చేతిలో బెట్నారు- నెత్తిన్నీళ్ళు బోసినారు. యింకా యేమేమో జేస్తా వుండారు. నాకేమో మొగ్గం కాడ మా యెదవ అరస్తా వుంటాడే" అంటూ నద్దీ ఊపుకుంటూ, చేతులు తిప్పతూ, గడగడా మాట్లాడుతూనే పద్మమ్మ వెళ్ళిపోయింది.

నీలమ్మ పొయిలోంచి కట్టెలు పూర్తిగా బయటకు లాగి, నీళ్ళు చల్లేసి బయలుదేరింది. బూబమ్మ పైట కొంగు తలకు చుట్టుకుని రోడ్డెక్కింది. మా పిన్నమ్మ మొత్తలోంచి వాకిట్లోకి వచ్చి నిలుచుంది. నేను లుంగీ బిగించి కట్టి కనుకొనల్లో పిసి తుడుచుకుంటూ బయలుదేరాను.

అతనికి ఇరవై అయిదేళ్ళ లోపే వయసుంటుంది. బక్కపలచగా వున్నాడు. మొహం పీక్కుపోయి వుంది. నీరసంవల్ల కాళ్ళూచేతులూవణుకుతున్నాయి. పేదతో

— ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు

**సాధారణంగా తల్లికి తన బిడ్డపై వుండే ప్రేమలో కొంత సంకుచితత్వమూ స్వార్థమూ వుంటుంది. పుట్టకముందు తను బిడ్డను కడుపులో దాచుకుని కాపాడుకున్నట్టే, పుట్టిన తర్వాత కూడా బిడ్డ చుట్టూ రక్షణ వలయంగా నిలుస్తుంది. కన్న కడుపుపై దెబ్బ తగిలిందా.. ఆ తల్లి హృదయం గడ్డ కట్టుకపోతుంది. మళ్లీ అది కరిగి కదిలిందా... సముద్రమై ముంచెత్తుతుంది. అప్పుడు తన వొడిలో చేరినవాడే తన కొడుకు!**

అలికిన పచ్చని వాకిట్లో పడుకోబెట్టారు. అతని తల కాంతమ్మ ఒడిలో వుంది.

''జరగండి, జరగండి- గాలాడ్నీండి బిడ్డకి. మీకే గదా చెప్పేది పొండి, పొండి'' అంటూ కాంతమ్మ హడావిడి చేస్తోంది. పైట కొంగుని చెంబులో ముంచి అతని ముఖంమీద అద్దింది.

"మే ఇజియా, యిపవ క్ర దెచ్చి, యిట్టిమరో! నాగేస్ప్రరావా! నువు బొయ్యి జంగమయ్యోరిని బిన్నా పిల్చకరాబో, ,ే. సురేంద్రా కూట్నీళ్ళు రెండు తపిల్లో పోస్కోరాబో" అంటూ చక చకా ఆదేశాలు ఇచ్చింది.

'వాయినా, వాయినా' యిట్ట జూడు, యిగో, యిట్ట జూడు. కళ్ళు దెరు...'' అంటూ కుడి చేత్తో సున్నితంగా అతని చెంపలమీద కొట్టింది.

ఎవరో ఆమె చేతికి కూట్నీళ్ళు అందిచ్చారు.

అతని నోరు బలవంతంగా తెరిచి, కొద్దిగా కూట్నీళ్ళు పోసి మూసేసింది. అంతా నిశ్శబ్దంగా చూస్తున్నారు. కొద్ది క్షణాల తర్వాత అతను గుటక వేశాడు.

చుట్టూ మూగిన గుంపుకి ప్రాణం వచ్చింది. అందరూ ఒకేసారి ఏదో మాట్లాడారు. అంతా కలగలిపి గడబిడ శబ్దం వచ్చింది.

'మ్మేయ్ నోర్ముయ్యండసే' అని కాంతమ్మ ఒక్క అరుపు అరిచింది.

గడబిడ కొంచెం తగ్గింది.

కాంతమ్మ ఆ బాటసారిని ఒళ్ళోంచి కొంచెం పైకి లేపింది. తలని తన ఎదకి ఆనించుకొని ఏటవాలుగా కూర్చోబెట్టింది. నోరు తెరిచి మరి కొన్ని కూట్నీళ్ళు పోసింది. అతను వెంటనే గుటక వేశాడు. ఈసారి గెడ్డం కింద అరచేతిని అడ్డుపెట్టి నీళ్ళు పట్టింది. గుటగుటా తాగాడు.

కాంతమ్మ ముఖం కాంతివంతమైంది.

బాటసారి పీకమీది నుంచి ఛాతీ మీదకి అరచేత్తో సున్నితంగా సవరించింది.

ఇంతలో అతను భళ్ళున కక్కేశాడు. తాగిన కూట్నీళ్ళన్నీ వెలికొచ్చేశాయి. కాంతమ్మ ఒడి అంతా తెల్లగా అసహ్యంగా తయారైంది.

'అయ్యో నాయినా' అని అతన్ని మరింత పొందికగా జవురుకొని కొంచెం పైకి లేపి కూర్చోబెట్టింది. వెన్నపు మీద చేత్తో సవరించింది. ఉచ్చిన గుంట మీద తట్టింది. యుద్ధంలో గాయపడ్డ సైనికుడికి నిపుణురాలైన నర్సు సేవ చేస్తున్నట్టుగా వుంది ఆ దృశ్యం.

మరి కొంతసేపటికి అతను చిన్నగా కనురెప్పలు తెరిచాడు. కాంతిని భరించలేక టక్కున మూసేశాడు.

గుంపు రణగొణమంది-

ఈసారి చిన్నగా కళ్ళు తెరిచాడు. అతని కళ్ళెదుట కాంతమ్మ ముఖం వుంది. హఠాత్తుగా మరోసారి వాంతి చేసుకున్నాడు. చేతులు రెండూ పొట్టలో ముడుచుకుని 'అమ్మా' అంటూ బాధగా మూలిగాడు. పేగులను మెలిపెడుతున్నట్టుగా అటూ ఇటూ దొర్లాడు.

కాంతమ్మ కలవరపడింది.

"రేయ్ జంగమయ్యోరు ఇంకా రాలేదా? పొయి చూడండ్రా" అని ఆందోళనగా అరిచింది.

బాటసారివేపు తిరిగి 'నాయినా నాయినా' అంటూ పిలిచింది.

'ఊ..' అంటూ బాధగానే అయినా అతను బదులిచ్చాడు.

మరి కాసేపటికి చేతులు రెండూ నేలకాన్చి లేచి కూచున్నాడు. కాంతమ్మ అతని వెనుక ఆదరవుగానే వుంది.

గిన్నెలో కొద్దిగా పద్దెన్నం పిసికింది- నిమ్మకాయ ఊరగాయ దబ్బ దాంట్లో కలిపింది. మెల్లగా అతని చేత తాగించింది. పైట కొంగుతో అతని పెదాలకు అంటిన మెతుకులు తుడిచింది.

పెదవిప్పి అతనేదో మాట్లాడబోయాడు.

"అయ్యో, అయ్యో! కొంచేపు గమ్మున పడుకో నాయినా, మాట్లాడబాక'' అంటూ ఒడిలో అతన్ని పడుకోబెట్టింది. విసనక్రతో విసరడం ప్రారంభించింది.

గుంపు సుదీర్ఘమైన ఒక నిట్టూర్పు విడిచింది.

కలకలం రేగింది.

బాటసారి గురించి తలో మాట అంటున్నారు.


''మే అమ్మ గనిందో పాపం, ఈడొచ్చి దిక్కులేనోడు అయ్యాడు.''

''ఎన్ని దినాలుగా కూడు లేదో, చూడమ్మా. వాగిసులో బిడ్డ పీనిగిలాగా వుండాడు.''

''ఎంత దూరం నించి నడిచొస్తుండాడో, కాళ్ళు జూడండి- ఎట్టుండాయో..''

''ఊళ్ళో పడ్డాడు గాబట్టి సరిపోయె. యే అడివిలోనో అయితే, పాణం అనావశింగా పొయ్యేదే గదా?''

''మన కమలమ్మ కొడుకు బాస్కరుడు గూడా యింత వాగిపోడే గదా! యాడుండాడో యేమో, పాణంతో ఉండాడో లేదో గూడా తెలీకపోయనే'' అని ఎవరో అన్నారు.



ఆ మాటతో కమలమ్మ చేతిలో ఊగుతున్న విసనక్ర ఆగిపోయింది.

చేతులు రెండూ వెనక్కి నేలమీద ఆన్చి, మబ్బు తునక అయినా లేక, గాఢమైన నీలం రంగుతో భీక రంగా వున్న ఆకాశంలోకి దీర్ఘంగా చూసింది.

కాంతమ్మ కనురెప్పలు కన్నీటి బరువుతో మూత బడ్డాయి. అనంతమైన దుఃఖాన్ని ఆమె గొంతు దిగ మింగింది.

విషాదంతో ఆమెను నీరసం ఆవరించింది.

కాంతమ్మ ముఖం కళావిహీనమై వెలవెల పోయింది. శోకం ఆమె గుండెల్లోంచి పెళ్ళు కొస్తోంది.

బాటసారి సేవలో తన్మయమైన కాంతమ్మలా లేదు ఇప్పుడు ఆమె. అనామకుడెవరినో అమ్మలా ఆదరించిన కాంతమ్మ కాదామె ఇప్పుడు.

'మే ఇజియా! యేం నోరుమే నీది? ఛా బుద్దిలా.. యెప్పడెప్పడి మాటో యిప్పడెందుకిక్కడ? నోటి కెంతొస్తే అంత మొరగడమేనంటే.. ముందూ ఎనకా జూసుకో బళ్ళా? పో ఇంగిక్కడ్నించి'' అంటూ ఎవరో మందలించారు.

''నేనేం అన్నానమ్మ.. నన్నాడిపోసుకుంటారు? ఈన్ని జూసి మన భాస్కరుడు గుర్తొచ్చిగదా! దుక్కంతో తల్సుకున్నాను'' అంటూ విజయమ్మ గుంపులోంచి వెళ్ళిపోయింది.

కాంతమ్మ భారంగా తలవంచి, తన ఒళ్ళో సేద దీరుతున్న బాటసారి ముఖం కేసి చూసింది. అతని ముఖం ఇప్పుడు తేటగా వుంది. కాంతమ్మ ముఖంలో నీలి నీడలు ఇప్పుడు కొంచెం తొలిగాయి.

ఒక జీవిత కాలపు దుఃఖాన్నంతా బిగబెట్టు కున్నట్టున్న కాంతమ్మను చూస్తే నా గుండె కెలికి నట్టయింది. కాంతమ్మ కన్నపేగు కష్టం నాకు తెలుసు. ఒకరు ఆర్చేదీ కాదు- తీర్చేదీ కాదు.

కాంతమ్మని నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ ఒంటరిగానే చూస్తున్నాను. ఆమె ఇల్లు ఆమెలాగే శిథిలముఖం వేసుకుని దిగాలు పడ్డట్టుగా వుంటుంది. ఈ వీథిలో ప్రతి ఇంటికీ బయట రెండు తిన్నె లుంటాయి. బియ్యం చెరుగుతూనో, పప్పులేరు తూనో, దాయాలాడుతూనో, విస్తరాకులు కుడు తూనో, కబుర్లాడుతూనో ఆడవాళ్ళంతా ఎప్పుడూ వాటిమీదే వుంటారు. ఒక్క కాంతమ్మ ఇంటి తిన్నెలు మాత్రమే ఎప్పుడూ ఖాళీగా వుంటాయి. ఆమె ఇంట్లో వున్నప్పుడూ, లేనపుడూ కూడా తలుపులు మూతబడే వుంటాయి- లోపల ఏం తింటుందో, ఏం తాగుతుందో ఎవరికీ తెలీదు- ఎవర్నీ, ఎప్పుడూ ఏ సాయమూ అడగదు.

కాంతమ్మ దినచర్య రాట్నం చక్రంలా వుంటుం ది. తెల్లవారి లేచి చేతికి ఖాకీ సంచి తగిలించు కుని బయలుదేరుతుంది. పట్టణానికి రెండు మైళ్ళ నడక- కృష్ణ మందిరంలో పూలు కట్టడం ఆమె పని. పూలు కట్టిన కూలి సొమ్ముతో, తిండి సామాను కొని ఖాకీ సంచిలో వేసుకొని వస్తుంది. ఆమెతో పాటు మరో

> లోకాన్నీ మానవ లోకాన్నీ మానవ నైజాన్నీ అర్థం చేసుకొని మనిషి ఈ లోకంలో ఈ సంఘంలో మంచి సభ్యుడిగా వుండేట్టు చేసే కథలు (ఆ విధం గా వుండడానికి అతని చేత ప్రయత్నం చేయించే కథలు) మంచివని నేను తలుస్తాను. రచనకి సాంఘిక ప్రయోజనం వుండాలని కొంతమంది అంటూ వుంటారు. దానికి నేను పై ప్రకారం అర్థం చెప్పు కున్నాను.
>
> — రావి శాస్త్రీ
>
> సేకరణ: తవుటు నాగభూషణం

ఇద్దరు కూడా పూలు కట్టేపనికి వెళ్తారు. ఆమె మాత్రం వాళ్ళతో సరిగా మాట్లాడ్డు - ఎప్పుడూ గంభీరంగా వుంటుంది. రాత్రి బాగా చీకటి పడ్డాక వాళ్ళు ముగ్గురూ పల్లెకి తిరిగి ప్రయాణ మవుతారు - అది డొంకదారి. చుట్టూ ముళ్ళ పొదలు - అయినా కాంతమ్మ కటిక చీకట్లో కూడా దృఢంగా నడుస్తుంది.

ఆమె సహచరులు ఒకరినొకరు హెచ్చరించు కుంటూ, ఏటిగట్టెక్కేటప్పుడు ఒకరినొకరు ఆదరవు చేసుకొని నడుస్తారు.

కాంతమ్మ మాత్రం మౌనంగా, అది పగలే అన్నట్టుగా నడుస్తుంది.

''కాంతమ్మా ఈడ గుంటుంది చూసి అడుగెయ్- ఇగో ఈడ మిట్ట- జాగర్త- కంప తగులుకునేను'' అంటూ మళ్ళీ హెచ్చరిస్తూనే వుంటారు.

కాంతమ్మ మాత్రం ఒక్క మాట అయినా బదులు పలకదు.

చీకటి రహస్యమేదో తనకు తెలిసి పోయినట్టే మరింత దృఢంగా అడుగులు వేస్తుంది.

కన్నపేగు కష్టమే కాంతమ్మని రాయిలా మార్చి వేసింది.

కాంతమ్మ కొడుకు భాస్కర్ ఇప్పుడెక్కడ వున్నాడో ఎవరికీ తెలీదు. చిన్నప్పటి నుంచీ అతని తీరు వింతగానే వుండేది. చెప్పా పెయ్యకుండా ఇంట్లోంచి వెళ్ళిపోయేవాడు. ఎక్కడ తిరుగుతాడో, ఏం చేస్తాడో ఏమోగానీ నెలకో, రెండు నెళ్ళకో తిరిగి వచ్చేవాడు.

కాంతమ్మ కొడుకు కోసం తపించిపోయేది.

ఇల్లు వదిలి వెళ్ళిన ప్రతిసారీ తల్లడిల్లిపోయేది.

అయితే కొడుకు తిరిగి వచ్చినప్పుడు మాత్రం అతన్ని ఒక్కమాటైనా అనేది కాదు. కొడుకుని చూసుకొని ఊరికే ఏడ్చేదంతే- ఇంటి పట్టున వున్నంతకాలం మహరాజులా చూసుకొనేది. అదేం బుద్దో అతను హఠాత్తుగా మళ్ళీ ఎటో వెళ్ళిపోయే వాడు. ఒక్కోసారి ఆర్నెల్లకో, సంవత్సరానికో తిరిగి వచ్చేవాడు. అమ్మపట్ల మాత్రం ఎప్పుడూ ఎంతో ప్రేమగా వుండేవాడు.

భాస్కరుడు అమ్మను వదిలి వెళ్ళి ఇప్పుడు ఆరేళ్ళు దాటింది. కాంతమ్మ కుమిలిపోతోంది. ఇంట్లో వున్న సొమ్ములన్నీ అమ్మి కొడుకు కోసం తనే ఊళ్ళన్నీ తిరిగి వెతికింది. జాడ జాబు లేదు. దుఃఖం ఒక్కటే ఆమెకు జీవితకాలం తోడుగా మిగిలింది.

ఎవరెవరో ఆమెకి భాస్కర్ గురించి ఏదేదో చెప్పేవారు.

తిరుపతిలో టాక్సీ డ్రైవర్‌గా కనిపించాడనీ, విజయవాడలో వున్నాడనీ చేప్పేవారు - కాదు 'మెద్రాసులో మన బాస్కరుడు పెద్ద రవుడీ అంట' అనీ అనేవారు.

కాంతమ్మ మాత్రం అన్నింటినీ మౌనంగానే వినేది- తనని పలకరించిన వాళ్ళకేసి ఆమె ఆతృతగా చూసేది ఏమైనా చెబుతారేమో అని-

ఉద్యోగం మీద ఊళ్ళు తిరిగే నేను కాంతమ్మని అప్పుడప్పుడూ పలుకరించేవాడిని- 'కాంతమ్మా బాగుండావా?' అంటూ తిన్నె మీద కూర్చునే వాడిని. ఆమె మొత్తలో మౌనంగా నిలుచుని, నా పరామర్శను పట్టించుకోకుండా నాకేసి ఆతృతగా చూసేది. కాంతమ్మ కళ్ళలో నాకు ఎప్పుడూ ఒకే ఒక్క ప్రశ్న జ్వలిస్తూ కనిపించేది.

** *** ***

నెల తర్వాత తిరిగీ నేను ఊరెళ్ళాను. కాంతమ్మను పలకరిద్దామనిపించింది. ఇంటి తలుపులు బార్లా తెరిచి వున్నాయి.

ఇంట్లోకి అడుగు పెట్టాను.

కళ కొట్టొచ్చినట్టు కనిపించింది- పరిశీలనగా చూశాను.

రెండు రాళ్ళ దిమ్మెల మీద మంచంలా వున్న విరిగిన ఉయ్యాల బల్ల - ఒక మూల పొయ్యి, కొన్ని సత్తు గిన్నెలు - నీళ్ళకుండ, గోడకి మాసికవేసిన ఖాకీ సంచి, దూలానికి వేలాడుతున్న లాంతరు- అన్నీ అవే వస్తువులు - అయినా ఏదో అందం ప్రత్యేకంగా కనిపిస్తోంది-

''కదల బాకరా యెదవన్నా - గమ్మున కూసోలేవా? పసిబిడ్డ మాదిరి తైతక్కలాడ తుండావే... తలకి బోసుకునే దానికి యేమమ్మ నా బట్టకి కష్టం... అయ్యో కండ్లు తెరవబాకరా నాయనా, మంట పుడతాయి-''

అదన్నమాట విశేషం-

భాస్కర్ తిరిగొచ్చాడు-

ఆనందంలో నా ఒళ్ళు జలదరించింది-

పెరట్లోకి ప్రవేశించాను.

పీట మీద భాస్కర్.

వీపు నా వేపుంది-

అలికిడికి కాంతమ్మ నన్ను చూసింది-

పలకరించింది - ఆమె గొంతులో జీవితం పట్ల సంతోషం వినిపించింది-

భాస్కర్ వెనుతిరిగి చూశాడు-

అతను భాస్కర్ కాదు-

ఆనాటి బాటసారి.